క్లుప్తంగా

ఆనందోత్సాహాలతో న్యూ ఇయర్ జరుపుకోవాలి

మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీష్



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం సూచించిన నిబంధనలను పాటిస్తూ.. కొత్త సంవత్సర వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కలెక్టర్ హరీష్ కోరారు. నూతన సంవత్సరంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రజలు అన్ని రంగాల్లో రాణించి సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఆంగ్ల నూతన సంవత్సరం -2023లో ప్రజలు కొత్త ఆలోచనలు, సరికొత్త నిర్ణయాలు, ఆశలు, ఆశయాలతో ముందుకెళ్లాలని కోరారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితానికి ఆనందాన్ని తీసుకు వస్తుందని ఆకాంక్షిస్తూ... జిల్లా ప్రజలకు కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వెంకటేశ్వర ఆలయానికి రూ.40 వేల విరాళం

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్‌నగర్, అయ్యప్పనగర్ కాలనీలోని ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెండి మకరతోరణం ఏర్పాటు కోసం దమ్మాయిగూడ మున్సిపల్ కౌన్సిలర్ పందాల అనురాధ, బీఆర్ఎస్ నేత యాదగిరిగౌడ్ దంపతులు రూ. 30 వేలు విరాళం ఇచ్చారు. విరాళం డబ్బును ఆలయ చైర్మన్ చికోటి సంతోష్‌కు అందజేశారు. మరో భక్తులు వెంకటస్వామి కూడా రూ.10 వేలను విరాళంగా అందజేశారు.

నిధులు లేక అభివృద్ధికి నోచుకోని పంచాయతీ



మాట్లాడుతున్న సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: నిధులు లేక అవుషాపూర్ పంచాయతీ అభివృద్ధికి నోచుకోవడం లేదని సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డి అన్నారు. పంచాయతీ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం విడుదల చేసే నిధులు పంచాయతీ విద్యుత్ బిల్లులు, పంచాయతీ నిర్వాహణకు కూడా సరిపోవడం లేదన్నారు. నిధుల కొరత వల్ల పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు కూడా సమయానికి ఇవ్వలేక పోతున్నామన్నారు. నిధుల కేటాయించని ఇటువంటి రాష్ట్ర ప్రభుత్వం ఉన్నా.. లేకున్నా ఒక్కటేనని ఆమె విమర్శించారు.

మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించాలి



కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: మహిళలు స్వయం ఉపాధిరంగంలో రాణించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి కుట్టుశిక్షణలో ఉచితంగా శిక్షణ ఇవ్వడంసంతోషించదగ్గ విషయమని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని11వ వార్డులో తపస్వీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో 30 మంది మహిళలకు 45రోజుల పాటు ఉచితంగా నిర్వహించిన కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని శిక్షణపూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మోకు రేణుకజగన్మోహన్ రెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, తపస్వీ ఆర్గనైజర్ ప్రెసిడెంట్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న క్రిష్ణమూర్తి

మల్కాజిగిరి: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతర పోరాటం చేస్తుందని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు క్రిష్ణమూర్తి, రంగయ్య తెలిపారు.నేరేడ్‌మెట్ అంబేడ్కర్ భవన్‌లో శనివారం నిర్వహించిన మల్కాజిగిరి ఏరియా మూడవ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయన్నారు. పీఆర్సీ, డీఏ మంజూరు, సీనియర్ సిటిజన్ల రైల్వే రాయితీ పునరుద్ధరించడంతో పాటు ఇతర సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. మల్కాజిగిరి అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా అశోక్, విజయ్‌కుమార్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, కృపాసాగర్, నర్సింగరావు, దాస్ పాల్గొన్నారు.

మూడేళ్లైనా ముసుగు తీయరాయె!

- నేతల విభేదాల మధ్య నలుగుతున్న 'మహనీయులు'
- గుండ్లపోచంపల్లిలో ప్రారంభానికి నోచుకోని విగ్రహాలు



గుండ్లపోచంపల్లి మున్సిపల్ ఆఫీస్ ఎదుట ముసుగు వేసిన ఉన్న అంబేద్కర్ విగ్రహం



మినీ ట్యాంక్ బండ్‌పై ముసుగులతో ఉన్న నేతల విగ్రహాలు

మేడ్చల్: దేశానికి, రాష్ట్రానికి, తమ ప్రాంతానికి సేవలు చేసిన నాయకుల విగ్రహాలను పెట్టుకోవడం.. వారి జయంతి, వర్ధంతి రోజున నివాళులర్పించి వారి సేవలను స్మరించుకోవడం సమాజంలో పరిపాటి. ఇదే విధంగానో, లేదా తన పేరు ఉండాలనో ఓ నాయకుడు ఏర్పాటు చేసిన విగ్రహాలను కనీసం ప్రారంభించకుండా ప్లాస్టిక్ కవర్లు కట్టి వారు సమాజాన్ని చూడకుండా చేశారు మరికొందరు నేతలు.

- గుండ్లపోచంపల్లి గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో అప్పటి సర్పంచ్ బేరి ఈశ్వర్ దాతల సాయంతో లక్షల రూపాయలు ఖర్చు చేసి గుండ్లపోచంపల్లి మినీ ట్యాంక్ బండ్‌పై 13 మంది దేశ, రాష్ట్ర నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేశారు.
- ప్రొటోకాల్ ప్రకారం శిలాఫలకాలపై ముఖ్యమంత్రి, మంత్రులతో పాటు తన పేరును కూడా చెక్కించాడు.
- ఈశ్వర్ పదవీ కాలం ముగియడం, ప్రత్యేకాధికారుల పాలన రావడం, ఆ తర్వాత గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీగా మారడంతో ఆ విగ్రహాలను ఎవ్వరూ ప్రారంభించలేదు.
- మున్సిపల్ పాలక వర్గం ఏర్పడి మూడేళ్లు అయినా నేతల విగ్రహాల ముసుగులను మాత్రం తొలగించలేదు.
- ఈ విగ్రహాల్లో అంబేద్కర్, తెలంగాణ తల్లి, వివేకానంద, సి.నారాయణరెడ్డి, జగ్జీవన్‌రాం, ఐలమ్మ, రాణిరుద్రమ దేవి, వంటి మహనీయులవి ఉన్నాయి.
- నేతలు డ్రైనేజీ కాలువ ఓపెన్ చేసినా పెద్ద శిలాఫలకం పెట్టి మరీ ఫొటోలకు ఫోజులు ఇచ్చి ప్రారంభిస్తారు.
- జాతికి సేవ చేసిన మార్గదర్శుల విగ్రహాలను ఎందుకు ప్రారంభించడం లేదో అధికార పార్టీ నాయకులకే తెలియాలి.

విగ్రహాల ముసుగులు తీయాలి



మినీ ట్యాంక్ బండ్‌పై లక్షలు వెచ్చించి దేశ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేసి మూడేళ్లుగా ముసుగులు కట్టి ఉంచడం ఎంతవరకు సబబు. ఒక నాయకుడు ఏర్పాటు చేసి తనకు ఏం పట్టనట్టుగా ఉంటే.. మరో నాయకుడు ఉన్న విగ్రహాలను పట్టించుకోవడం లేదు. తమ విభేదాలు పక్కన పెట్టి దేశానికి, ప్రపంచానికి ఆదర్శనీయులైన వారి విగ్రహాలను ప్రారంభించాలి.

– భానుచందర్

మహనీయులను అవమానించడమే..



గుండ్లపోచంపల్లి మున్సిపల్ రాజకీయంలో దేశానికి, రాష్ట్రానికి స్ఫూర్తినిచ్చిన నాయకులు బలైపోయారు. ఒక నాయకుడు గొప్ప కోసం శిలాఫలకంపై తాటికాయంత అక్షరాలతో తన పేరు రాయించుకున్నాడు. ఆ విగ్రహాలను ప్రారంభిస్తే ఎక్కడ అతడికి పేరు వస్తుందోనని ప్రస్తుత పాలకులు ప్రారంభించడం లేదు. ఇలా చేయడం దేశానికి సేవ చేసిన మహనీయులను అవమానించడమే అవుతుంది.

– మహేష్, గుండ్లపోచంపల్లి

వెంటనే ప్రారంభించాలి



నాయకులు తమ రాజకీయాలను పక్కన బెట్టి దేశ నాయకుల విగ్రహాలను వెంటనే ప్రారంభించాలి. నాయకులు ప్రారంభించకపోతే మున్సిపాలిటీలోని యువకులంతా కలిసి అందరి విగ్రహాలకు పాలాభిషేకం చేసి ముసుగులు తీయాల్సి వస్తుంది.

–రవి, గుండ్లపోచంపల్లి

నేటి పోటీ ప్రపంచంలో డైనమిక్ బిజినెస్ మోడల్స్ కీలకం



వార్షికోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో వీసీ రామచంద్రం, రిజిస్ట్రార్ ఫాతిమా

అనురాగ్ వర్సిటీ ఉప కులపతి రామచంద్రం

ఘట్‌కేసర్: నేటి పోటీ వ్యాపార ప్రపంచంలో డైనమిక్ బిజినెస్ మోడల్సే కీలకమని అనురాగ్ యూనివర్సిటీ ఉప కులపతి రామచంద్రం అన్నారు. అవుషాపూర్ అనురాగ్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో శనివారం జరిగిన ఎంటర్‌ప్రైజ్ సంస్థ సబ్జీ వార్షికోత్సవం వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉత్పత్తుల ధరలు, సరఫరా, వినియోగదారుల అభిప్రాయాలు తెలుసుకోవాలని, అప్పుడే వస్తువు రకం, స్వభావంపై అవగాహన పెరుగుతుందన్నారు. ఎంటర్ ప్రైజ్ సంస్థ సబ్జీ ద్వారా విద్యార్థులకు ఉత్పత్తుల సోర్సింగ్, గ్రేడింగ్, డిస్‌ప్లేయింగ్ నేర్చుకుంటారన్నారు. మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ ముత్తారెడ్డి మాట్లాడుతూ, ఎంబీఏ విద్యార్థులకు మైక్రో ఎంటర్‌ప్రైజెస్ ద్వారా హెచ్‌ఆర్, మార్కెటింగ్, ఫైనాన్స్‌లో అనుభవం వస్తుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఫాతిమా, అసోసియేట్ ప్రొఫెసర్లు సురేశ్, ముత్తారెడ్డి, డాక్టర్ బాలాజీ, నారాయణరెడ్డి, అగ్రికల్చర్, ఎంబీఏ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దేవుళ్లను కించపర్చిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు



పేట్ బషీరాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు



ఘట్‌కేసర్ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న బిక్కునాయక్

కీసర: హిందూ దేవుళ్లను కించపర్చేలా మాట్లాడిన బైరి నరేశ్‌పై పీడీ యాక్ట్ నమోదు చేసి అరెస్టు చేయాలని కీసర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్పస్వాములు, బీజేపీ నేతలు శనివారం డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం చీర్యాల చౌరస్తాలో గురుస్వామి బెస్త వెంకటేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అయ్యప్ప స్వాములు గ్రామ నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కీసర పోలీస్‌స్టేషన్‌లో బైరి నరేశ్‌పై ఫిర్యాదు చేశారు. మరోపక్క నాగారం మున్సిపాలిటీకి చెందిన బీజేపీ అధ్యక్షుడు వేణుగోపాల్, కౌన్సిలర్ లక్ష్మి ఆధ్వర్యంలో కీసర పోలీస్‌స్టేషన్‌లో బైరి నరేశ్‌పై ఫిర్యాదు చేశారు.

గుండ్లపోచంపల్లిల్లో...

మేడ్చల్: దేవుళ్లపై బైరి నరేశ్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని లక్ష్మీ నారాయణ ఆలయం వద్ద అయ్యప్ప స్వాములు, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం నరేశ్‌ను అరెస్టు చేసి పీడీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ అమరం హేమంత్‌రెడ్డి, బీజేపీ నాయకులు అశోక్, భానుప్రకాష్, పవన్, గురుస్వాములు మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రంజిత్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో...

ఘట్‌కేసర్: అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నరేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్టీ మోర్చా జాతీయ సభ్యులు బిక్కు నాయక్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ పీఎస్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన అతడిపై పీడీ యాక్ట్ పెట్టాలని ఫిర్యాదులో కోరారు.



కీసర పోలీసు స్టేషన్‌లో బైరి నరేశ్‌పై ఫిర్యాదు చేస్తున్న అయ్యప్పస్వాములు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు



కారును ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో గాయపడ్డ యువకులు

మేడ్చల్: మద్యం మత్తులో బండి నడుపుతూ ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టి ముగ్గురు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మేడ్చల్– శామీర్‌పేట రోడ్డులో సిద్దిపేటకు చెందిన నలుగురు యువకులు ద్విచక్ర (యాక్టివా) వాహనంపై వెళ్తూ పూడూర్ చౌరస్తా సమీపంలో ముందు వెళ్తున్న కారును ఢీకొట్టారు. దీంతో వారి వాహనం కింద పడటంతో నలుగురూ రోడ్డుపై పడిపోయారు. ఒకరికి స్వల్ప గాయాలు కాగా, మిగతా ముగ్గురికి పాక్షికంగా గాయాలయ్యాయి. నలుగురినీ పోలీసులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

మరో ఘటనలో..

రోడ్డు దాటుతున్న పారిశుద్ధ్య కార్మికుడిని లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. మేడ్చల్ మున్సిపాలిటీలో పనిచేసే కార్మికుడు వీరేష్(52) బస్ డిపో వద్ద జాతీయ రహదారి దాటుతుండగా లారీ ఢీకొనడంతో కాలు విరిగి గాయపడ్డాడు. పోలీసులు అతడిని ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కాలు విరిగిన వీరేష్

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, మల్లేశ్

ఘట్‌కేసర్: పట్టణంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆంగ్ల నూతన సంవత్సరం వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ హాజరై క్యాండిల్ వెలిగించి కేక్ కట్ చేశారు. 2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2023 ఆంగ్ల నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లేశ్, మల్లేశ్, గట్టు మైసమ్మ కమిటీ డైరెక్టర్ పద్మారెడ్డి, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దాసు, బాలరాజ్, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, జంగయ్యయాదవ్, డాక్టర్ మల్లేశ్, దాసు, రాందాసు, దేవేందర్ ముదిరాజ్, టీఆర్ఎస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రాధాకష్ణముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం భూమి కబ్జాపై ఫిర్యాదు



కేంద్రీయ విద్యాలయం భూమిని ట్రాక్టర్‌తో చదును చేస్తున్న ప్రైవేట్ వ్యక్తులు

ఘట్‌కేసర్: కేంద్రీయ విద్యాలయం భూమి కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్ఎఫ్‌సీ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల్లో శనివారం ఫిర్యాదు చేశారు. ఎన్ఎఫ్‌సీ నగర్ కేంద్రీయ విద్యాలయానికి సర్వే నంబర్ 257లో సుమారు 4 ఎకరాల భూమిని 1989లో కేటాయించామన్నారు. ఈ భూమిని కొందరు ప్రైవేట్ వ్యక్తులు చదును చేసి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. భూకబ్జాపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో సొసైటీ అధ్యక్షుడు రూప్‌చంద్, కార్యదర్శి సోమయ్య, డైరెక్టర్ లక్ష్మణ్‌నాయక్, వెంకట్‌నారాయణ ముదిరాజ్ ఉన్నారు.

దళిత శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలి: ఎంపీపీ



సమావేశంలో పాల్గొన్న సర్పంచ్ తదితరులు

ఘట్‌కేసర్: దళిత శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం అవుషాపూర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పాలకవర్గ సమావేశానికి ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దళిత శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ, నీటి ట్యాంక్ నిర్మించాలని, గ్రామంలో అవసరమైన చోట వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీలు నిర్మించాలని పాలకవర్గ సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, కార్యదర్శి గౌతమి, వార్డు సభ్యులు రాధా, సంధ్య, దివ్య, అరుణ, మల్లేశ్, పద్మ, శ్రీనివాస్‌గౌడ్, రవినాయక్, వీరేశ్, కోఆప్షన్ సభ్యుడు నరసింహగౌడ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు ఆపడంలో భాగస్వాములు కావాలి



ఘనాపూర్‌లో మాట్లాడుతున్న సర్పంచ్ గోపాల్‌రెడ్డి

ఘట్‌కేసర్: బాల్య వివాహాలు ఆపడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఘనాపూర్ సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఘనాపూర్ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి శశికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రతి నెలా నిర్వహించనున్న గ్రామసభలో బాలల రక్షణపై చర్చించి అవసరమైతే చర్యలు తీసుకుంటామన్నారు. 0–18 ఏళ్ల లోపు బాలల భద్రత, బాలల భిక్షాటన, బాలలతో పని చేయించిన, తప్పిపోయిన బాలల వివరాలు, బాలలపై జరిగిన అఘాయిత్యాలపై టోల్‌ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందజేయాలన్నారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ పరమేశ్‌గౌడ్, బాలల పరిరక్షణ సభ్యుడు శ్రావణ్ కుమార్, హెచ్ఎం నరేందర్, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, సరోజ, వీఓ బాలమ్మ, వార్డు సభ్యులు పవన్, ఆశాలత, మల్లేశ్, సతీశ్‌కుమార్, అనిల్‌రెడ్డి, పాల్గొన్నారు.

శబరిమలకు బయలుదేరిన స్వాములు



రావల్‌కోల్ నుంచి శబరిమలకు బయలుదేరి వెళ్తున్న స్వాములు

మేడ్చల్: మండలంలోని రావల్‌కోల్ గ్రామానికి చెందిన 70 మంది అయ్యప్ప స్వాములు శనివారం శబరిమలకు బయటుదేరి వెళ్లారు. గ్రామంలోని శివాలయంలో ఇరుముడులు కట్టుకుని గ్రామంలో పాదయాత్ర చేసి వివిధ రవాణా మార్గాల ద్వారా అయ్యప్ప దర్శనం కోసం కేరళకు వెళ్లారు. ఒకే రోజు 70 మంది ఇరుముడులు కట్టుకోవడంతో గ్రామం అయ్యప్ప శరణుఘోషతో మార్మోగింది. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు రాహుల్ యాదవ్, పలువురు గురుస్వాములు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్

మల్కాజిగిరి: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని బీజేపీ మల్కాజిగిరి నియోజకవర్గ ప్రభారి ఎస్.వి.సుభాష్ అన్నారు. నియోజకవర్గ కన్వీనర్ సదానంద్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఆనంద్‌బాగ్‌లో నిర్వహించిన సమావేశంలో సుభాష్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ వైఖరితో ప్రజలు విసిగిపోయారని రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పని చేయాల్సిన అవసరముందన్నారు. సమావేశం అనంతరం నూతనంగా నియమితులైన ఎస్.వి.సుభాష్‌కు కార్పొరేటర్లు శ్రవణ్, రాజ్యలక్ష్మి, సనునీతాయాదవ్ సన్మానించారు.

లక్ష్యం చేరని చేప పిల్లల పంపిణీ

- అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- చేప పిల్లల సైజులో మోసం
- 333 చెరువులకు గాను ఇప్పటి వరకు 237 చెరువుల్లో మాత్రమే పంపిణీ

సాక్షి, మేడ్చల్ జిల్లా: మత్స్యశాఖకు నిర్లక్ష్యపు చీడ పట్టింది. వందలాది మంది మత్స్యకారులకు లబ్ధి చేకూర్చే పథకాల అమల్లో పారదర్శకత లోపించేలా ఆ శాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు పలు విమర్శలకు తావిస్తోంది. మత్స్యకారుల ప్రయోజనం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చెరువుల్లో చేప పిల్లలను పంపిణీ చేసే కార్యక్రమం జిల్లా మత్స్యశాఖ అలసత్వంతో నీరుగారుతోంది. మత్స్యకారుల అమాయకత్వం, సంబంధిత అధికారుల ఉదాసీనతతో కాంట్రాక్టర్లు చేప పిల్లల పంపిణీలో అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తక్కువ సైజు పిల్లలు...

- జిల్లాలో 40–45ఎంఎం, 80–100 ఎంఎం చేప పిల్లలను చెరువుల్లో విడుదల చేయాల్సి ఉండగా, చాలా చెరువుల్లో సైజు తక్కువ ఉన్న చేప పిల్లలను వదలడంతో పాటు లెక్కల్లోనూ మోసాలకు పాల్పడ్డారు. ఈ అక్రమాలపై మత్స్యకారులు, సొసైటీ సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేయటంతో స్పందించిన అధికారులు తాత్కాలిక దిద్దుబాటు చర్యలు చేపట్టినా... తర్వాత పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది.

అభ్యంతరాలతో వెనక్కి

- జిల్లాలో శామీర్‌పేట, మేడ్చల్ చెరువులలో వదిలేందుకు తీసుకొచ్చిన చేప పిల్లల సైజు చిన్నగా, నాణ్యత లేకపోవటంతో ... స్థానిక మత్స్యకారులు అభ్యంతరం తెలిపారు. దీంతో శామీర్‌పేట నుంచి 4.77 లక్షల చేప పిల్లలను, మేడ్చల్ నుంచి 6 లక్షల చేప పిల్లలను మత్స్య శాఖ అధికారులు వెనక్కి పంపించారు. అలాగే, ప్యాకెట్‌లో 1000 బదులుగా 800 చేపపిల్లలు మాత్రమే ఉన్నాయని మత్స్యకారులు సంబంధిత అధికారులతో వాగ్వాదానికి దిగిన ఘటనలు జరిగాయి.



చేప పిల్లల పంపిణీ ఇలా..

- మేడ్చల్ జిల్లాలో ఈ ఏడాది 333 చెరువులలో 91 లక్షలు చేప పిల్లలు (పెద్ద సైజు 80–100ఎంఎం చేప పిల్లలు 13.50 లక్షలు, చిన్న సైజు 40 – 45ఎంఎం.చేపపిల్లలు 77.50 లక్షలు) వదలాల్సి ఉండగా.. ఇప్పటివరకు 237 కేవలం 63.93 లక్షలు మాత్రమే పంపిణీ చేశారు. ఇందులో 80–100 ఎంఎం చేపపిల్లలు 8,89,700 కాగా ,35–40 ఎంఎం చేపపిల్లలు 55,03,300 ఉన్నాయి.